సాక్షి ఆదిలాబాద్

ఆదివారం । 30 । మార్చి । 2025

తెలుగుదనం ఉట్టిపడేట్టు



కాలంతోపాటు వస్త్ర ధారణ మారినా.. తెలుగుదనం ఉట్టిప డేది మాత్రం పంచక ట్టులోనే. ఉమ్మడి జిల్లావాసులు పంచక ట్టుతో తెలుగు సంస్కృ తిని చాటుతున్నారు.

8లో ▸



ఓం శ్రీ శనీశ్వరాయ నమః

శని అమావాస్య పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని శ్రీ శనీశ్వర ఆలయానికి భక్తులు బారులు తీరారు. వేకువజాము నుంచే తరలివచ్చారు.

9లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
41.0/25.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతాయి. మధ్యాహ్నం ఎండ తీవ్రతతో పాటు ఉక్కపోత ప్రభావం కనిపించనుంది.

న్యూస్‌రీల్

2న పాపన్నగౌడ్ వర్ధంతి

కైలాస్‌నగర్: సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి కార్యక్రమాన్ని ఏప్రిల్ 2న అధికారికంగా నిర్వహించనున్నట్లు కలెక్టర్ రాజర్షి షా ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉదయం 11గంటలకు నిర్వహించనున్న కార్యక్రమానికి జిల్లాలోని బీసీ సంఘాల నాయకులు, గౌడ కులస్తులు భారీగా తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు.

3న దొడ్డి కొమురయ్య జయంతి

తెలంగాణ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య జయంతి కార్యక్రమాన్ని ఏప్రిల్ 3న అధికారికంగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ రాజర్షి షా ప్రకటనలో తెలిపారు. ఉదయం 11గంటలకు కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించే కార్యక్రమానికి బీసీ సంఘాల నాయకులు, గొల్ల, కుర్మ కులస్తులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు.

జిల్లా ప్రజలకు కలెక్టర్ ఉగాది శుభాకాంక్షలు

కైలాస్‌నగర్: ఉగాది వేడుకలను జిల్లా ప్రజలు ఆనందోత్సాహాల నడుమ జరుపుకోవాలని కలెక్టర్ రాజర్షి షా కోరారు. నూతన సంవత్సరం అందరికి మంచి చేకూరాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని పేర్కొంటూ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

కలెక్టరేట్ ఏవోగా వర్ణ

కైలాస్‌నగర్: కలెక్టరేట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (ఏవో)గా ఏస్తేరు వర్ణను నియమిస్తూ కలెక్టర్ రాజర్షి షా ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఏవోగా పనిచేస్తున్న బి.రాంరెడ్డి ఈ నెల 31న ఉద్యోగ విరమణ చేయనున్నారు. దీంతో ఆయనస్థానంలో కలెక్టరేట్ డీ,ఈ,జీ సెక్షన్ల సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న వర్ణను ఏవోగా నియమించారు. ఎఫ్ సెక్షన్ సూపరింటెండెంట్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న ఎం.శైలజకు ఈ సెక్షన్ సూపరింటెండెంట్‌గా అదనపు బాధ్యతలు అప్పగించా రు. అలాగే ఉట్నూర్ తహసీల్దార్ కార్యాలయంలో ఏపిక్ నాయబ్ తహసీల్దార్‌గా పని చేస్తున్న ఎం.కవితారాణిని కలెక్టరేట్ డి–సెక్షన్ సూపరింటెండెంట్‌గా డిప్యూటేషన్‌పై బాధ్యతలు అప్పగిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.


'ఉపాధి'లో అగ్రస్థానంలో నిలపాలి



మాట్లాడుతున్న డీఆర్డీవో రవీందర్

కైలాస్‌నగర్: గ్రామాల్లో కూలీలకు వంద రోజుల పని కల్పించేలా ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ ఉపాధిహామీ పథకం అమల్లో జిల్లాను అగ్రస్థానంలో నిలపాలని డీఆర్డీవో రాథోడ్ రవీందర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని టీటీడీసీలో జిల్లాలోని తొమ్మిది మండలాలకు చెందిన ఏపీవోలు, ఈసీలు, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్స్‌తో నూతన ఆర్థిక సంవత్సర ఉపాధి పనుల కార్యాచరణపై శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాబ్‌కార్డు ఉండి పనులకు వచ్చేందుకు ఆసక్తి చూపే ప్రతీ కూలీకి పని కల్పించాలన్నారు. తద్వారా గ్రామాల వారీగా నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని సూచించారు. రానున్న రెండు నెలలు కీలకమైనందున కూలీలకు పెద్ద సంఖ్యలో పనులు కల్పించాలన్నారు. ఎండ తీవ్రత దృష్టిలో ఉంచుకుని పని ప్రదేశాల్లో తగు వసతులు కల్పించాలన్నారు. పంచాయతీ కార్యదర్శులతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహించినా, అక్రమాలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇందులో ఏడీ ఆర్డీవో కుటుంబరావు, ఏపీవో రాజేశ్వర్, ఏవో గంగాధర్, ఏపీడీ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

వినూతనం



- జిల్లాలో విభిన్నంగా ఉగాది వేడుకలు
- షడ్రుచులు, పంచాంగపఠనంతో పాటు..
- సాగు పనులకు అన్నదాత శ్రీకారం

తెలుగువారి నూతన సంవత్సరం.. ఉగాది. ఏటా చైత్ర శుద్ధ పాడ్యమి రోజున వైభవంగా నిర్వహించుకుంటారు. జీవితంలోని అన్ని అనుభూతులను షడ్రుచుల్లా ఆస్వాదించాలనే అంతరార్థంతో పచ్చడిని స్వీకరిస్తారు. ప్రత్యేక పూజలు చేసి పంచాంగ పఠనాల్లో పాల్గొంటారు. అయితే జిల్లాలో మాత్రం దీనిని 'ఆరుకునే' పండుగగా భావిస్తారు. ఈ రోజున రైతులు చేను పనులకు శ్రీకారం చుట్టడం ఆనవాయితీ. ఈ యుగాది తమ జీవితాల్లో వెలుగులు నింపాలని, పాడి పంటలు పండాలని, అందరూ సుఖసంతోషాలతో ఉండాలని అన్నదాతలు వేడుకుంటారు. ఇలా జిల్లాలో వినూత్నంగా నూతన సంవత్సరాన్ని ఆహ్వానిస్తారు.

– ఆదిలాబాద్/బోథ్



పూజలు చేస్తున్న రైతు కుటుంబం (ఫైల్)



ప్రకృతిపై కృతజ్ఞతాభావంతో...



ప్రకృతిలో భాగమైన మనిషి.. ఆ ప్రకృతికి సదా రుణపడి ఉండాలనే ఉద్దేశంతో అన్నదాతలు పంచభూతాలను పూజించడం భారతీయ సంస్కృతిలో భాగం. అందుకే సృష్టికి ఆరంభమైన ఉగాది రోజున వ్యవసాయ పనులు ప్రారంభిస్తూ, ప్రకృతిపై కృతజ్ఞతాభావంతో పూజించడం హిందూ సంప్రదాయంలో కనిపిస్తుంది. ము ఖ్యంగా ఆదిలాబాద్ ప్రాంతంలో సూర్యోదయానికి గడి య ముందు ఉండే బ్రహ్మ ముహూర్తంలో చేనుకు వెళ్లి పూజించడం ఆనవాయితీ. ఉగాది రోజున ఏ పనిని ప్రారంభించినా శుభప్రదం అవుతుంది.

– ఆంజనేయులు, పండితుడు, ఆదిలాబాద్

ఉగాది అంటే తెలుగువారందరికీ ఇంటిని మామిడి తోరణాలతో అలంకరించడం, నూతన వస్త్రాలు ధరించడం, పూజలు, పిండి వంటలు, షడ్రుచుల పచ్చడి, పంచాగ శ్రవణం వంటివి చేపడతారు. జిల్లాలో రైతులు మాత్రం దీనిని ఆరుకునే పండుగగా జరుపుకుంటారు.

ప్రకృతిని ఆరాధిస్తూ..

ఆరుగాలం శ్రమించే అన్నదాతలు తమకు అండగా నిలిచే ప్రకృతిని ఆరాధించడంలోనూ ముందే ఉంటారు. ప్రకృతితో పాటు పశుపక్ష్యాదులు, పనిముట్లను సైతం పూజిస్తారు. సాగులో చేదోడు వాదోడుగా ఉంటున్న ప్రాణులను,జీవం లేని పరికరాలను కూడా సమదృష్టితో చూస్తూ ఉగాది రోజు పూజించడం జిల్లాలో ఆనవాయితీ. పంచభూతాలకు ప్రణమిల్లి పాడిపంటలతో పాటు తమను సల్లంగా చూడాలని మొక్కుకుంటారు. ఈ ప్రత్యేక పూజ కార్యక్రమాన్ని కర్షకులు ఆరుకోవడంగా పిలుచుకుంటారు. ఈ పర్వదినాన వ్యవసాయ పనులు షురూ చేస్తే మంచి పంట దిగుబడులు వస్తాయని అన్నదాతల నమ్మకం. అందుకే రైతులు వేకువజామునే నిద్ర లేచి, తల స్నానం ఆచరించి సంప్రదాయ దుస్తులు ధరిస్తారు. చేలకు వెళ్లి సాగు పనిముట్లతో పాటు అరక లేదా నాగలికి పూజలు చేస్తారు. పెరుగన్నం బూరెలను ప్రసాదంగా స్వీకరిస్తారు. అనంతరం అరక కట్టి భూమిని దున్ని సాగు పనులు ప్రారంభిస్తారు. ఏటా మాదిరిగా ఈ సారి కూడా పండుగను సంప్రదాయబద్ధంగా జరుపుకునేందుకు జిల్లా వాసులు సిద్ధమయ్యారు.

ఆలయాల్లో పూజలు.. పంచాంగ పఠనాలు

తెలుగు సంవత్సరానికి స్వాగతం పలుకుతూ వసంత రుతువులో మోడు వారిన వృక్షాలు సైతం చిగురిస్తాయి. ఈ విధంగా యుగాది రోజున ఏ కార్యక్రమం మొదలుపెట్టినా విజయవంతమవుతుందని ప్రజలు విశ్వసిస్తారు. ఉదయాన్నే షడ్రుచుల పచ్చడి తయారు చేసుకుని స్వీకరిస్తారు. మధ్యాహ్నం ఆలయాలకు బారులు తీరుతారు. వేద పండితులు చేసే పంచాంగ పఠనాన్ని శ్రద్ధగా వింటారు.

ప్రజలు సుఖశాంతులతో ఉంటారు..



విశ్వావసు నామ సంవత్సర ఉగాది ఈ సారి ఆదివారం వచ్చింది. ఈ ఏడాది రవి రాజు అవడం వలన నాయకులు, అధికారులకు పరస్పర విరోధములు ఉండే అవకాశం అధికం. ఈ సారి పంటలు సరసమైన ధరకు లభించి ప్రజలంతా సుఖశాంతులతో ఉంటారు. విద్యార్థులు అనుకూలమైన ఫలితాలను పొందుతారు. ఈ ఏడాది రవి అరోగ్యాధిపతి అవ్వడం వల్ల వర్షపాతం తక్కువగా నమోదయ్యే అవకాశాలున్నాయి. రాజకీయ పరమైన ఒడిదొడుకుల వల్ల ముఖ్యమైన నాయకుల మార్పు చేర్పులు ఉండే అవకాశం మెండుగా కనిపిస్తున్నాయి.

– చికిలి వశిష్ఠ నారాయణశాస్త్రి, ఋగ్వేద సలక్షణ ఘనపాటి, ఆదిలాబాద్

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

- ఎస్పీ అఖిల్ మహాజన్

ఆదిలాబాద్‌టౌన్: సైబర్ నేరగాళ్లు పలు రకాలుగా నేరాలకు పాల్పడుతున్నారని ఈ మేరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. అవగాహనతోనే వాటిని అడ్డుకోగలుగుతామని పేర్కొన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, సైబర్ క్రైమ్ జరిగిన వెంటనే నేషనల్ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్ 1930కి ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని, లేదా cybercrime. gov. in అనే వెబ్‌సైట్ ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. మొబైల్ హ్యాకింగ్, జాబ్‌ఫ్రాడ్, స్టాక్ మార్కెటింగ్ ఫ్రాడ్, డిజిటల్ అరెస్ట్, కస్టమర్ కేర్ ఫ్లాగ్, క్రెడిట్ కార్డ్ డెబిట్ కార్డ్ లోన్ ఫ్రాడ్, ఇన్వెస్ట్మెంట్ ఫ్రాడ్, యూపీఐ ఫ్రాడ్, సోషల్ మీడియా అకౌంట్ హ్యాకింగ్ ఫ్రాడ్ ప్రస్తుత సమాజంలో జరుగుతున్న నేరాలన్నింటిపై ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. వాటిని అప్రమత్తతతోనే నివారించవచ్చన్నారు. సైబర్ క్రైం జరిగిన మొదటి గంటలోపే ఫిర్యాదు చేయడం ద్వారా స్కామర్ అకౌంట్‌ను ఫ్రీజ్ చేసి డబ్బులు రికవరీ చేయడం సులభతరం అవుతుందన్నారు. గడిచిన వారం వ్యవధిలో జిల్లాలో 15 సైబర్ నేరాల ఫిర్యాదులను స్వీకరించినట్లుగా ఆయన వెల్లడించారు. పట్టణంలోని వన్‌టౌన్‌లో ఏడు ఫిర్యాదులురాగా, టూటౌన్‌లో ఒకటి, రూరల్‌లో రెండు, నేరడిగొండ, బేల, ఇంద్రవెల్లి, సిరికొండ, నార్నూర్ స్టేషన్లలో ఒక్కో ఫిర్యాదు చొప్పున వచ్చినట్లు తెలిపారు.



మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాపై దృష్టి

ఆదిలాబాద్‌టౌన్: పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇచ్చోడలో అక్రమంగా నిల్వ ఉంచిన 290 క్వింటాళ్ల రాయితీ బియ్యం శనివారం స్వాధీనం చేసుకుని, ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. జిల్లాలో గడిచిన వారం వ్యవధిలో 600 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టుకోగా అందులో 580 క్వింటాళ్లు ఇచ్చోడలోనే స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. బోథ్ నుంచి ఆదిలాబాద్‌కు వస్తున్న లారీని తనిఖీ చేయగా అందులో 290 క్వింటాళ్ల బియ్యం లభ్యమైనట్లు తెలిపారు. జైనథ్‌కు చెందిన డ్రైవర్ సిడాం మోతిరాం, రవాణాలో కీలకంగా ఉన్న ఆదిలాబాద్‌లోని ఆదర్శ నగర్‌కు చెందిన రైస్‌మిల్ యజమాని వి. వెంకటరాజు, బోథ్‌కు చెందిన కైపు ప్రభాకర్‌రెడ్డి బియ్యంను సరఫరా చేసే వ్యక్తిగా గుర్తించి ముగ్గురిపై ఇచ్చోడ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. మరో డ్రైవర్ మహమ్మద్ యూసఫ్ కూడా ఉన్నట్లు తెలిపారు. బియ్యాన్ని పట్టుకోవడంలో కీలక పాత్ర పోషించిన ఇచ్చోడ పోలీసు సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

పారదర్శకంగా నియామక ప్రక్రియ

ఆదిలాబాద్: ఉమ్మడి ఆదిలాబాద్ ఆర్టీసీ రీజియన్ పరిధిలో ఔట్ సోర్సింగ్ డ్రైవర్ల నియామక ప్రక్రియ పారదర్శకంగా కొనసాగుతోందని రీజినల్ మేనేజర్ సోలోమన్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అర్హులు ఎవరైనా మధ్యవర్తుల మాటలు నమ్మి మోసపోవద్దని తెలిపారు. ఎలాంటి అక్రమాలకు తావు లేకుండా నియామక ప్రక్రియ జరుగుతుందని వివరించారు. ఎలాంటి సమాచారానికైనా రీజినల్ మేనేజర్‌కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

మున్సిపల్ పద్దు.. రూ.106.40కోట్లు

- 2025–26 సంవత్సర వార్షిక బడ్జెట్ ఖరారు
- గతేడాదితో పోల్చితే రూ.10.15 కోట్లు పెంపు
- ఆమోదం తెలిపిన బల్దియా ప్రత్యేకాధికారి

ప్రధాన కేటాయింపుల వివరాలు (నిధులు.. రూ.కోట్లలో)
ఔట్‌సోర్సింగ్ సిబ్బంది జీతాలు : 14.30
పారిశుధ్య, నీటిసరఫరా నిర్వహణ : 3.08
విద్యుత్ చార్జీలు : 3.81
10శాతం గ్రీన్‌బడ్జెట్ : 4.66
వార్డుల వారీగా అభివృద్ధి పనులకు..: 3.15

కైలాస్‌నగర్: రానున్న ఆర్థిక సంవత్సరానికి (2025–26) గాను ఆదిలాబాద్ మున్సిపల్ బడ్జెట్‌ను రూ.106.40 కోట్లతో అధికారులు రూపొందించారు. గతేడాదితో పోల్చితే పది శాతం నిధులు పెంచి వార్షిక బడ్జెట్‌కు రూపకల్పన చేశారు. పాలకవర్గం ఉంటే కౌన్సిల్‌లో చర్చించి ఆమోదించేవారు. ప్రస్తుతం అధికారులు రూపొందించిన ఈ బడ్జెట్‌కు మున్సిపల్ ప్రత్యేకాధికారి, అదనపు కలెక్టర్ ఖుష్బూ గుప్తా ఆమోదముద్ర వేసినట్లుగా మున్సిపల్ కమిషనర్ సీవీ ఎన్.రాజు తెలిపారు.

ఈసారి రూ.10.15 కోట్లు పెంచి..

2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.79కోట్ల 16లక్షల 47వేలతో బడ్జెట్ రూపొందించారు. ఆర్థిక సంవత్సరం ముగింపు నాటికి అందులో రూ.78కోట్ల 77లక్షల 85వేలను ఖర్చు చేసినట్లుగా పేర్కొన్న అధికారులు రూ.38.64లక్షలు నిల్వ ఉన్నట్లుగా తెలిపారు. రానున్న ఆర్థిక సంవత్సరానికి గాను పది శాతం నిధులు అదనంగా పెంచుతూ 106 కోట్ల 90లక్షల 17వేలతో కూడిన బడ్జెట్‌ను రూపొందించారు. గతేడాదితో పోల్చితే రూ.101.5లక్షలు అధికం.



ఆదిలాబాద్ మున్సిపల్ కార్యాలయం

బడ్జెట్ ఆదాయ, వ్యయ అంచనాల వివరాలు

రాబోయే ఆర్థిక సంవత్సరానికి గాను పన్నుల ద్వారా రూ.36కోట్ల 16లక్షల 55వేలు, పన్నేతర విభాగాలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కేటాయించే నిధుల ద్వారా రూ.70కోట్ల 35లక్షలు సమకూరనున్నట్లుగా అంచనా వేశారు. అలాగే మున్సిపల్ సాధారణ నిధులు ఆస్తిపన్ను, వేకెండ్‌ల్యాండ్ సంబంధించిన పన్నుల ద్వారా రూ.13.80 కోట్లు, పట్టణ పరిధిలోని ప్లాట్లు, భూములు రిజిస్ట్రేషన్ల ద్వారా స్టాంప్ డ్యూటీ, సర్‌చార్జి రూపేణ రూ.2కోట్లు రావచ్చని అంచనా వేశారు. తైబజార్, బల్దియా సిబ్బంది నివాస క్వార్టర్స్ అద్దెలు షాపింగ్ కాంప్లెక్స్, మ్యుటేషన్, ప్రకటనలు, సేవింగ్ బ్యాంకు నిల్వలపై వడ్డీ ద్వారా రూ.20.36 కోట్ల ఆదాయం సమకూరనున్నట్లుగా ప్రతిపాదనలు రూపొందించారు. ఇందులో సాధారణ నిధుల నుంచి రూ.36కోట్ల 10లక్షల 29వేలు, ప్లాన్, నాన్ ప్లాన్ గ్రాంట్స్ ద్వారా రూ.70కోట్ల 30లక్షలను వ్యయం చేయనున్నట్లుగా అంచనా వేశారు.

ఎంపీ, ఎమ్మెల్యే నిధుల అంచనా ఇలా..

15వ ఆర్థిక సంఘం ద్వారా గత ఆర్థిక సంవత్సరంలో రూ.7.75 కోట్లతో అంచనాలు రూపొందించగా ఈ సంవత్సరానికి గాను రూ.7.50కోట్లు వచ్చే అవకాశమున్నట్లుగా అంచనా వేశారు. పట్టణ ప్రగతి కింద గతేడాది రూ.7.75 కోట్లతో అంచనా వేయగా ఈఏడాది రూ.7.50 కోట్లుగా అంచనా వేశారు. ఈ రెండు నిధులకు సంబంధించి రూ.25లక్షల చొప్పున రూ.50లక్షలను బడ్జెట్‌లో తగ్గించి అంచనాలు రూపొందించారు. టీయూఎఫ్ఐడీసీ నిధులు రూ.30కోట్లు , ఎంపీ ల్యాడ్స్ ద్వారా రూ.15కోట్లు వచ్చే అవకాశమున్నట్లుగా అంచనా వేశారు. ఎమ్మెల్యేకు సంబంధించి ఏసీడీపీ నిధులు గతేడాది రూ.70లక్షలుగా అంచనా వేయగా ఈ సారి మరో పది లక్షలు అధికంగా వచ్చే అవకాశమున్నట్లుగా ప్రతిపాదనలు రూపొందించారు.

తప్పనిసరిగా చేయాల్సిన కేటాయింపుల్లో ...

పట్టణంలో కొత్తగా విలీనమైన ప్రాంతాలు, బీసీ, మైనార్టీల నివాసిత వార్డులు, మురికివాడలు, ఎలాంటి మౌలిక సౌకర్యాలు లేని ప్రాంతాల్లో అంచనా బడ్జెట్ మిగులు నిధుల్లో 1/3 కేటాయింపులు తప్పనిసరిగా చేయాలనే నిబంధనల మేరకు రూ.1.30 కోట్ల నిధులను ప్రతిపాదించారు. అలాగే రోడ్ల నిర్మాణం కోసం రూ.10లక్షలు, కాలువల నిర్మాణాలకు రూ.10లక్షలు, కల్వర్టులకు రూ.5లక్షలు, పార్కులు, ఆట స్థలాలు, ఖాళీ స్థలాల పరిరక్షణ కోసం రూ.5.63 లక్షల చొప్పున అదనంగా కేటాయింపులు చేస్తు కోటి రూ.60లక్షల63 వేలను బడ్జెట్‌లో రూపకల్పన చేశారు.

మౌలిక వసతులకు ప్రాధాన్యత

పట్టణ ప్రజలకు పూర్తిస్థాయిలో మౌలిక సౌకర్యాలు కల్పించడమే ప్రధాన లక్ష్యం. ఆ దిశగానే బడ్జెట్‌లో కేటాయింపులు చేశాం. కార్మికుల వేతనాలు పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు చెల్లించేలా బల్దియాకు సమకూరే ఆదాయం అనుసరించి కేటాయింపులు చేశాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి అందే నిధులతో పట్టణంలోని వార్డులను అభివృద్ధి చేసేలా అంచనాలను రూపొందించాం. ప్రధానంగా పట్టణంలో పచ్చదనం పెంపొందించేందుకు ప్రాధాన్యతనిస్తూ గ్రీన్‌బడ్జెట్‌ను వంద శాతం వెచ్చించేలా ప్రతిపాదనలను చేశాం. వాటికనుగుణంగానే ముందుకు సాగుతాం.

– సీవీఎన్.రాజు, మున్సిపల్ కమిషనర్

సార్వత్రిక సమ్మె జయప్రదం చేయండి

- సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్

కైలాస్‌నగర్: కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలు నిరసిస్తూ కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మే 20న చేపట్టనున్న అఖిల భారత సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సంఘ భవనంలో శనివారం నిర్వహించిన జిల్లా స్థాయి సమ్మె వర్క్‌షాప్‌నకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. 2019లో కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన వెంటనే కార్మికులు ఏళ్ల తరబడి అనేక పోరాటాలు, త్యాగాల ద్వారా సాధించుకున్న 29 కార్మిక చట్టాలను కార్పొరేట్లకు అనుకూలంగా సవరణలు చేస్తూ నాలుగు లేబర్ కోడ్‌లుగా విభజించిందన్నారు. నేషనల్ మానిటైజేషన్ పైప్‌లైన్ పేరుతో ప్రైవేటీకరణను మరింత వేగవంతం చేసిందన్నారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేస్తున్న కార్మిక, ఉద్యోగులకు ఉద్యోగ భద్రతను దూరం చేసిందని ఆరోపించారు. కార్మిక, కర్షక ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టడానికి కేంద్ర కార్మిక సంఘాలన్నీ ఐక్యంగా సమ్మెకు సిద్ధం కావాలని కోరారు. ఇందులో కూరపాటి రమేశ్, బొజ్జ ఆశన్న, అన్నమొల్ల కిరణ్, మల్లేశ్, చిన్నన్న, నవీన్‌కుమార్, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పి.భాస్కర్

డీఈవో ప్రణీతకు సన్మానం

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా విద్యాశాఖాధికారి టి.ప్రణీతను కార్యాలయ అధికారులు, ఉద్యోగులు శనివారం ఘనంగా సన్మానించారు. ఈ నెల 31న ఉద్యోగ విరమణ పొందనున్న నేపథ్యంలో ముందస్తుగా పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. పుష్పగుచ్ఛాలు అందజేసి వీడ్కోలు పలికారు. నిర్మల్ జిల్లాలో ఏడీగా, డీఈవోగా పనిచేసిన ఈమె 2021 నవంబర్‌లో జిల్లాలో ఇన్‌చార్జి డీఈవోగా బాధ్యతలు చేపట్టారు. కార్యక్రమంలో ఏడీ వేణుగోపాల్‌గౌడ్, ఏసీ వేణుగోపాల్ రెడ్డి, సూపరింటెండెంట్ మధుసూదన్‌రెడ్డి, డైట్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కిరణ్ కుమార్, సెక్టోరియల్ అధికారులు ఉదయశ్రీ, సుజాత్‌ఖాన్, నారాయణ, శ్రీకాంత్ గౌడ్, డైట్ కళాశాల సూపరింటెండెంట్ మమత పాల్గొన్నారు.

జిల్లా విద్యాశాఖ అధికారిగా దుర్గా ప్రసాద్

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా నూతన విద్యాశాఖ అధికారి (ఎఫ్ఏసీ)గా ఎస్‌వీ.దుర్గా ప్రసాద్ నియామకమయ్యారు. ప్రస్తుత డీఈవో ప్రణీత ఈ నెల 31న పదవీ విరమణ పొందనున్నారు. ఈ క్రమంలో ఆమె స్థానంలో హైదరాబాద్‌లోని డైరెక్టర్ కార్యాలయంలో మోడల్ స్కూల్ విభాగం డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేస్తున్న దుర్గా ప్రసాద్‌ను నియమిస్తూ విద్యాశాఖ డైరెక్టర్ మదన్ మోహన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన ఏప్రిల్ 1న బాధ్యతలు స్వీకరించనున్నారు.



డీఈవో ప్రణీతను సన్మానిస్తూ..

రాజ్యాంగ పరిరక్షణే కాంగ్రెస్ ధ్యేయం

- రాష్ట్ర కనీస వేతన సలహాబోర్డు ఛైర్మన్ జనక్ ప్రసాద్

కైలాస్‌నగర్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మతపరమైన రాజకీయాలు, నియంతృత్వ పోకడలతో దేశాన్ని భ్రష్టు పట్టిస్తోందని తెలంగాణ రాష్ట్ర కనీస వేతన సలహా బోర్డు ఛైర్మన్ జనక్ ప్రసాద్ ఆరోపించారు. పట్టణంలో శనివారం నిర్వహించిన జైబాపు, జైభీం జైసంవిధాన్ జిల్లా సన్నాహక సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. రాజ్యాంగ పరిరక్షణే ధ్యేయంగా రాహుల్ గాంధీ చేపట్టిన జై బాపు, జై భీం, జై సంవిధాన్ నినాదంతో ప్రతి ఒక్కరం ముందుకు సాగుదామని పిలుపునిచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ సుపరిపాలనను అందిస్తుందన్నారు. రాజ్యాంగ పరిరక్షణ నినాదంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలను పార్టీ శ్రేణులు ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. అనంతరం అందరితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు దుర్గం భాస్కర్, నరేష్ జాదవ్, ఆత్రం సుగుణ, ఆడె గజేందర్, గోక గణేష్‌రెడ్డి, ఫైజుల్లాఖాన్, లోక ప్రవీణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రచార పోస్టర్ విడుదల చేస్తున్న జనక్ ప్రసాద్

క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

నిర్మల్‌రూరల్: ఉమ్మడి జిల్లాలోని ఆదిలాబాద్, నిర్మల్‌లో ఎంజేపీ డిగ్రీ కళాశాలల్లో గెస్ట్ లెక్చరర్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నిర్మల్ ఎంజేపీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. నిర్మల్ డిగ్రీ కళాశాలలో (బాలురు) గణితం, ఫిజికల్ సైన్స్, కెమిస్ట్రీ, జువాలజీ, ఇంగ్లిష్, పొలిటికల్ సైన్స్, హిస్టరీ సబ్జెక్టుల్లో ఒక్కో పోస్టు ఖాళీగా ఉందని పేర్కొన్నారు. ఆదిలాబాద్‌లోని ఉమెన్స్ డిగ్రీ కాలేజీలో బాటనీ, ఫిజిక్స్, గణితంలో ఒక్కో పోస్టు ఖాళీగా ఉందని తెలిపారు. వివరాల కోసం నిర్మల్ 9505520097, ఆదిలాబాద్ 889760 2060 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

తెలంగాణ ఖోఖో జట్టు సారథిగా ప్రశాంత్

ఆదిలాబాద్: తెలంగాణ రాష్ట్ర ఖోఖో సీనియర్ జట్టు సారథిగా జిల్లా క్రీడాకారుడు మడావి ప్రశాంత్ ఎంపికయ్యాడు. జనవరి 9 నుంచి 11వ తేదీ వరకు వరంగల్‌లో జరిగిన సీనియర్ రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో అత్యుత్తమ ప్రతిభకనబర్చిన ప్రశాంత్ రాష్ట్ర జట్టుకు నాయకత్వం వహించనున్నాడు. జిల్లాలోని ఇంద్రవెల్లి మండలం బుర్సన్ పటార్- కోలాంగూడ గ్రామానికి చెందిన కాన్షీరాం-అయ్యుబాయి దంపతుల కుమారుడు ప్రశాంత్ ప్రస్తుతం డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. ఈనెల 31 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు ఒడిశా రాష్ట్రం పూరి జిల్లాలో జరగనున్న 57వ ఖోఖో సీనియర్ జాతీయస్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహించనున్నాడు. అదేవిధంగా జిల్లా కేంద్రంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలలో శిక్షకుడిగా వ్యవహరిస్తున్న బొజ్జం రంజిత్ తెలంగాణజట్టు కోచ్‌గా, జిల్లాకు చెందిన మరో క్రీడాకారుడు పి.మధు సైతం జిల్లానుంచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఇక మహిళల విభాగంలో కె.నాగేశ్వరి రాష్ట్రం నుంచి జాతీయస్థాయి పోటీల్లో పాల్గొననుంది.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

ఇచ్చోడ: మద్యం మత్తులో పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై తిరుపతి కథనం ప్రకారం..మండలంలోని చిన్న సల్యాద గ్రామానికి చెందిన కాత్లె లక్ష్మణ్ (40) గత కొన్నిరోజులుగా మద్యానికి బానిసయ్యాడు. శనివారం ఉదయం మద్యం మత్తులో పురుగుల మందు తాగి వాంతులు చేస్తుండగా భార్య లక్ష్మి గమనించి అంబులెన్స్ సిబ్బందికి సమాచారం అందించింది. వారు అక్కడికి చేరుకుని లక్ష్మణ్‌ను రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ సాయంత్రం మృతిచెందాడు. భార్య ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

తెలుగుదనం ఉట్టిపడేట్టు

• ఆహార్యంలో పంచకట్టు ఠీవీ.. • ప్రత్యేకత చాటుకుంటున్న ఉమ్మడి జిల్లా వాసులు



పంచకట్టు.. సంప్రదాయ వస్త్రధారణ. కాలంలోపాటు వస్త్రధారణ మారినా.. తెలుగుదనం ఉట్టిపడేది మాత్రం పంచకట్టులోనే. వృత్తులు, విధులు, ఉద్యోగాల రీత్యా వస్త్రధారణ వేరుగా ఉంటుంది. అయినా ఉమ్మడి జిల్లాకు చెందిన కొందరు నేటికీ సంప్రదాయ పంచకట్టులో ఠీవీ చాటుకుంటున్నారు. సంస్కృతి, సంప్రదాయాన్ని భావితరాలకు అందిస్తున్నారు. వస్త్రధారణ ఆధారంగానే 'మాది ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా'.. మేం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వాసులం' అని చెప్పకనే చెబుతున్నారు. ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు రైతులు, ప్రభుత్వ ఉపాధ్యాయులు తెలుగుదనం ఉట్టిపడేలా ఇప్పటికీ తెల్లని చొక్కా, ధోవతి, కండువా ధరిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. తెలుగు సంస్కృతిని చాటి చెప్తున్నారు.

పెద్దల నుంచి వస్తున్న ఆచారం



కేమ లక్ష్మణ్

తాంసి: తెలుగుదనం ఉట్టిపడేలా, నిండు గంభీరంగా కనిపిస్తున్న ఈ రైతు తాంసి మండలంలోని పొన్నారి గ్రామానికి చెందిన కేమ లక్ష్మణ్. దశాబ్దాల నుంచి ప్రతీరోజు తెల్లని చొక్కా, దోవతి, కండువా ధరించి తెలుగు రైతుకు నిర్వచనంలా కనిపిస్తాడు. తమది వ్యవసాయ కుటుంబమని, తమపెద్దలు ఆచరించినట్లుగా తాను కూడా తెలుగు రైతు సంప్రదాయాన్ని కచ్చితంగా పాటిస్తూ ఉంటానని పేర్కొంటున్నాడు.

సంప్రదాయం మరవలేదు



మల్లెపూల నర్సయ్య

బజార్‌హత్నూర్: మండల కేంద్రానికి చెందిన మల్లెపూల నర్సయ్య తెలుగు సంస్కృతికి అద్దంపట్టేలా 40 ఏళ్లుగా పంచెకట్టు (దోవతి) ధరిస్తున్నాడు. 1981లో పీహెచ్‌డీ పూర్తి చేశాడు. రాజకీయాలపై మక్కువతో కాంగ్రెస్‌లో చేరి 2001, 2019లో బజార్‌హత్నూర్ జెడ్పీటీసీ సభ్యుడిగా ఎన్నికయ్యాడు. ఉన్నత చదువులు చదివినా రాజకీయాల్లో రాణిస్తున్నా తెలుగు సంప్రదాయ కట్టుబాట్లను ఇప్పటికీ ఆచరిస్తున్నారు.

తెలుగులోనే సంతకం



భవాని ఆనంద్, ప్రభుత్వ ఉపాధ్యాయుడు

బోథ్: మండల కేంద్రానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు భవానీ ఆనంద్ అర్లి బి గ్రామంలోని మండల పరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత శాస్త్రం బోధిస్తున్నారు. అతనికి చిన్నతనం నుండి తెలుగు భాష అంటే అభిమానం. అందరూ ఇంగ్లిష్‌లో సంతకం చేస్తున్నా తనుమాత్రం 40 ఏళ్లుగా తెలుగులోనే చేస్తున్నారు. తెలుగుపై తనకున్న అభిమానం చాటుకుంటున్నార

'సరికొత్త ఉగాది'



అదిగదిగో..
వస్తోంది
విశ్వావసు
నామ సంవత్సర
ఉగాది!
తెలుగు
కొత్త సంవత్సరంలో
వెలుగులు విరజిమ్ముతూ..
కొత్త ఆశల చిగుర్లతో
పాత క్యాలెండరుని పారద్రోలి..
ఓ కొత్త తెలుగు క్యాలెండర్‌గా ఉనికిని
చాటడానికి!!
విశ్వావసు క్రాంతితో..
తెలుగువారి లోగిళ్లలో..
వస్తున్నాదదిగో కొంగొత్త కాంతితో..
సరికొత్త ఉగాది!!
షడ్రుచుల కొత్త మేళవింపు
వసంతాన్ని వెంటబెట్టుకొని
చైత్రంతో సరాగాలాడుతూ
లేత మామిడి చిగురులు
మానవాళికి ఓ తాంబూలం
కొమ్మలపై కూర్చున్నా కోకిలమ్మలు
మధురంగా కూస్తూ
విశ్వావసును స్వాగతిస్తున్నాయి
మానవాళికి కొత్త సందేశానిస్తున్నాయి..
రైతన్నల కళ్లలో పరిఢవిల్లే ఓ కొత్తకాంతి..
నిజమైన ప్రశాంతి విశ్రాంతి!!
ముంగిళ్లలో ముత్యాల ముగ్గులు పరిచి..
రతనాల రంగులు వేసి స్వాగతం
పలుకుదాం!!

– అంబటి నారాయణ, తెలుగు ఉపాధ్యాయుడు, చామన్‌పెల్లి పాఠశాల
సేకరణ: లక్ష్మణచాంద

ఈ ఉగాది.. కొత్త పునాది



తెలతెల్లవారే
కోయిల రాగాలతో
పచ్చని మామిడి
తోరణాలతో
ముంగిట హరివిల్లు
రంగులతో
ఈ ఉగాది.. కొత్త
జీవితానికి పలికే నాంది..
నోరూరించే బూరెలతో
కోరికోరి చేసే పిండివంటలతో
షడ్రుచుల సమ్మేళన పచ్చడితో
ఈ ఉగాది.. జీవనపోరాటానికి పునాది..
చిన్నపెద్దల నూతన వస్త్రాలతో
సంస్కృతీ సంప్రదాయాల
కొత్తపండుగతో
శ్రీవిశ్వావసు నామ సంవత్సరంతో
ఈ ఉగాది.. విశ్వాసానికి వారధి..

– ఆయిటి సాహితి, యువకవి, నిర్మల్
సేకరణ: నిర్మల్

'విశ్వావసు'కు స్వాగతం పలుకుదాం



అణగారిన గుండెగూళ్ల నిండా ఆశల ఊసులు అల్లుతూ..
స్నేహ సౌరభాల తోరణాలతో 'విశ్వావసు'కు స్వాగతం
పలుకుదాం..
సమస్యలను, సవాళ్లను సమర్థవంతంగా
ఎదుర్కొనేందుకు ఆత్మవిశ్వాసంతో ముందుకెళదాం..
తీపి జ్ఞాపకాల మధురిమలో గత చేదు మరచి..
మమకారాల మాధుర్యాన్ని నలుగురితో పంచుతూ ఆశగా జీవితాన్ని ప్రేమిద్దాం.

– రాఘవేంద్ర దారవేణి, తాంసి, ఆదిలాబాద్
సేకరణ: తాంసి

శ్రీ విశ్వావసు వత్సరమా! స్వాగతం



శ్రీ విశ్వావసు వర్షమా
స్వాగతం సుస్వాగతం
కొత్త ఉషస్సులతో..
కొంగొత్త జీవితాలనీయ..
కులమతాల అడ్డుగోడలు కూలిపోవాలని..
పసిడి పంటల రాసులతో గాదెలు
నిండాలనీ..
పేద, ధనిక లేని సమసమాజం రావాలని..
మతహింస రక్కసికి మరణశాసనం రాయాలని..
మానవత్వపు విరులు ప్రతీ ఎదలో వెల్లివిరియాలని..
ఉత్తర, దక్షిణ ప్రాంతీయ భేదాలు సమసిపోవాలని..
కుళ్లు రాజకీయాలకు చెల్లు చీటి రాయాలని..
సుఖశాంతుల నిలయమై వసుధ వర్ధిల్లాలని..
ప్రేమ, మైత్రి విశ్వమంతా ఆవహించాలని..
నవ శకానికి నాంది పలుకాలని..
చైత్రమాసంలో వసంతుడు పలికే..
ఓ నవవర్ష పర్వమా స్వాగతం స్వాగతం..
తీపి, వగరు, చేదు, కారం, ఉప్పు, పులుపు
షడ్రుచుల పచ్చడి..
నవజీవన సారమని అందించ యుగాది..
తొలి పర్వమై ఏతెంచె శ్రీ విశ్వావసు వర్షము..
సర్వజనహితమును చేకూర్చ..
సత్సంబంధాలు నొసగ..
ఓ విశ్వావసువత్సరమా! స్వాగతం! స్వాగతం

– గంగుల చిన్నన్నా, తెలుగు ఉపాధ్యాయుడు, బోసి
సేకరణ: తానూరు

ఉగాది అంటే



పంట చేనుకు,
పంచే మనిషికి
ముడిపడిన వేదిక
బసవన్నల నడకకు, కలుపు
మొక్కల
అంతానికి వేదిక
అందరికీ నూతన
సంవత్సరం
అన్నదాత శ్రమకు ముహూర్తం
మామిడి చెట్లకు పిందెలు
మోతుకు చెట్లకు పువ్వులు
పంట చేలల్లో పందిళ్లు
పండిన మేత తింటున్న గొడ్డుగోదలు
తెల్లారకముందే గంటల చప్పుళ్లు
పందిళ్ల కింద గుడాల బుక్కుళ్లు
ఈ విశ్వవసు నామ సంవత్సరంలో
న్యాయంగా బతకాలి
మన దేశం నుంచి అవినీతి పారిపోవాలి
అందరి కష్టాలు దూరమవ్వాలి
ప్రజలందరి ముఖంలో సంతోషం
వెదజల్లాలి

రచన: చిల్క సతీష్, యాపల్ గూడ, ఉపాధ్యాయుడు
సేకరణ: ఆదిలాబాద్ టౌన్

తొలి వేకువజామున వసంత కోకిల



స్వరాల
సరాగాలు
వినిపిస్తుంటే..
ముడుచుకున్న
ఆలోచనలు
స్నిగ్ధమనోహరంగా
మనస్సు పొరల్లో
విచ్చుకోవాలి..!
కలల వాకిళ్లపై ఆశల కల్లాపి చల్లి
అంతరంగిక లోగిళ్ల నిండా
వసంత వేడుకలు ఆవిష్కృతమవ్వాలి..!
ప్రతినోటా స్వచ్ఛమైన సత్యం
ఉషస్సులా ఉదయించాలి..!!

– పసుల ప్రతాప్, ఉపాధ్యాయుడు, ఆదిలాబాద్
సేకరణ: ఆదిలాబాద్ టౌన్

బియ్యం లారీ పట్టివేత

ఇచ్చోడ: అక్రమంగా పీడీఎస్ బియ్యం తరలిస్తున్న లారీని శనివారం పట్టుకున్నట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. ముందస్తు సమాచారంతో మండలంలో వాహనాల తనిఖీ చేస్తుండగా బియ్యం తరలిస్తున్న లారీని పట్టుకున్నట్లు పేర్కొన్నారు. లారీలో 290 క్వింటాళ్ల బియ్యం ఉన్నట్లు తెలిపారు. లారీడ్రైవర్ సిడాం మోతిరాంతోపాటు వెంకటరాజు, సీతారామరాజు, కైపు ప్రభాకర్‌రెడ్డి, అంజిరెడ్డిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌కు టోకరా

• రూ.16 లక్షలు పోగొట్టుకున్న బాధితుడు
• ఆదిలాబాద్‌లో ఘటన

ఆదిలాబాద్‌టౌన్: సైబర్‌నేరగాళ్లు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌కు టోకరా వేశారు. ఇంట్లో కూర్చుని లక్షలు సంపాదించవచ్చనే ఆశచూపి రూ.16 లక్షలను దండుకున్నారు. పట్టణంలోని నేతాజీచౌక్‌కు చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌కు ఇటీవల టెలిగ్రామ్‌లో లింక్ పంపారు. లైక్ చేస్తే డబ్బులు వస్తాయని ఆశ చూపారు. ఆయనకు మొదట నమ్మకం కుదిరేలా రూ.10 వేల నగదును సదరు వ్యక్తి బ్యాంకు అకౌంట్‌లో జమ చేశారు. రెండింతల డబ్బులు వస్తాయని నమ్మించారు. దీంతో ఆయన ఈనెల 24, 25, 26 తేదీల్లో ఆన్‌లైన్ ట్రాన్సక్షన్ ద్వారా తొలుత రూ.50 వేలు, ఆ తర్వాత రూ.2 లక్షలు, ఇలా మొత్తం రూ.16 లక్షల 79 వేలను సైబర్ మోసగాళ్లకు సమర్పించుకున్నాడు. తన వద్ద ఉన్న డబ్బులే కాదు బ్యాంకులో లోన్ తీసుకుని మరీ వారికి చెల్లించాడు. తీరా ఆయన అకౌంట్‌లో డబ్బులు జమకాకపోవడంతో మోసపోయానని గుర్తించి లబోదిబోమన్నాడు. వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేయగా సీఐ సునీల్ కుమార్ కేసు నమోదు చేశారు.

పెద్దమ్మ గుడిలో చోరీ



బయట పడేసిన హుండీ

బోథ్: మండలంలోని కౌఠ(బి) గ్రామంలోని పెద్దమ్మ గుడిలో చోరీ జరిగింది. శుక్రవారం రాత్రి సమయంలో గుర్తుతెలియని వ్యక్తి ఆలయ తాళం పగులగొట్టి హుండీని ఎత్తుకెళ్లాడు. అందులో నగదును తీసుకుని పక్కనే ఉన్న వాగు పరిసర ప్రాంతంలో హుండీని పడివేశాడు. శనివారం పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. త్వరలో దొంగను పట్టుకుంటామని తెలిపారు.

టీజీఎల్ కంపెనీపై కేసు

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీసుస్టేషన్ పరిధిలో నిమావలలో కొనసాగుతున్న ట్రూ లీడ్ జనరేషన్ (టీజీఎల్) సేల్స్ మార్కెటింగ్ కంపెనీపై శనివారం కేసు నమోదు చేసినట్లు ఆదిలాబాద్ రూరల్ సీఐ ఫణిధర్, ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. వారి కథనం ప్రకారం.. టీజీఎల్ ట్రైనింగ్ యూనిట్‌లో కొందరు యువతి, యువకులకు మార్కెటింగ్ పేరిట శిక్షణ అందజేస్తూ కొంతమేర ఫీజులు తీసుకుంటున్నారు. ఇతరులను మరికొందరిని చేర్పించాలని, అదనంగా ఫీజు చెల్లించాలని అప్పుడే మార్కెటింగ్ కోసం వస్తువులు ఇస్తామని నిర్వాహకులు సూచించారు. శిక్షణ తీసుకుంటున్న యువతి పాటిల్ గంగోత్రి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

నిర్వాహకుల ఫిర్యాదుతో..

టీజీఎల్ కంపెనీ డబ్బులు ఇవ్వాలని, లేకపోతే కంపెనీ ఎదుట ధర్నా చేపడుతామని హెచ్చరించిన పలువురి కేసు నమోదు చేసినట్లు సీఐ, ఎస్సై తెలిపారు. కొందరు విద్యార్థి సంఘాల నాయకులు డబ్బులు ఇవ్వాలని మూడు నెలలుగా ఇబ్బందులకు గురిచేస్తున్నారు. నిర్వాహకుల ఫిర్యాదుతో అక్షయ్, నిఖిల్, కార్తీక్ తోపాటు మరికొంత మందిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

జెన్ ఏఐలో ఇంకా వెనుకబాటే..!


అత్యాధునిక సాంకేతికతను అందిపుచ్చుకుని ఉపయోగించుకోవడంలో భారతీయ పరిశ్రమలు, సంస్థల వెనుకడుగు

బోస్టన్ కన్సల్టెన్సీ గ్రూప్ (బీసీజీ) తాజా నివేదిక వెల్లడి

జెన్ ఏఐ ప్రయోజనాలను 80% డెవలపర్లు గుర్తించినా, ఉపయోగిస్తున్నది 39 శాతమే

భద్రతపై సందేహాలు, ఉద్యోగాలు పోతాయనే భయమే కారణమంటున్న నిపుణులు

సాక్షి, హైదరాబాద్: 'జనరేటివ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్'(జెన్ ఏఐ) వల్ల కలిగే ప్రయోజనాలను ఉపయోగించుకోవడంలో భారత పరిశ్రమలు, సంస్థలు వెనుకడుగు వేస్తున్నాయి. గ్లోబల్ ఐటీ పవర్‌హౌస్‌గా గుర్తింపు పొందడంతో పాటు టెక్నాలజీ ట్రేడ్‌లో 250 బిలియన్ డాలర్ల పరిశ్రమగా 50 లక్షల మంది ఐటీ నిపుణులతో విరాజిల్లుతున్న భారత ఐటీ పరిశ్రమ 'జెన్ ఏఐ'కీలక మలుపు వద్ద నిలిచింది. ప్రస్తుతం అంతర్జాతీయ స్థాయి అవుట్ సోర్సింగ్ రంగంలో భారత్ ఆధిపత్యం కొనసాగుతున్న దశలో ఎల్‌ఎల్‌ఎం ఫైన్ ట్యూనింగ్, క్లౌడ్ కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీ వంటి నైపుణ్యాల్లో యువతరం (నెక్స్ట్-జనరేషన్) '51 శాతం మేర స్కిల్ టాలెంట్ గ్యాప్'ను ఎదుర్కొంటున్నట్టు తాజా అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ పరిస్థితుల వల్ల భవిష్యత్తులో కృత్రిమ మేథ ఏఐ సంబంధిత ఆవిష్కరణల్లో తమ ప్రాధాన్యతలను కోల్పోయే పరిస్థితులు ఏర్పడవచ్చుననే ఆందోళన భారత నిపుణుల్లో వ్యక్తమవుతోంది. 'జెన్ ఏఐ'వల్ల కలిగే ఉత్పాదకత వృద్ధి ప్రయోజనాలను 83 శాతం డెవలపర్లు గుర్తించినా, వారు దీనిని ఉపయోగిస్తున్నది 39 శాతమేనని, దానిని అనుసరిస్తూ, తమకు తగ్గట్టుగా వర్తింప చేసుకునే నవయువ డెవలపర్లు 31 శాతానికే పరిమితమవుతున్నట్టు బోస్టన్ కన్సల్టెన్సీ గ్రూప్ (బీసీజీ) తాజా అధ్యయనంలో తేలింది. ఈ సవాళ్లను సరైన పద్ధతుల్లో సమాధానాలు వెతుక్కోవడంతో పాటు వాటిని అధిగమించే దిశలో చర్యలు చేపట్టకపోతే గ్లోబల్ ఏఐ లీడర్లుగా ఉన్న యూఎస్ఏ, చైనాల కంటే వెనుకబడే ప్రమాదం ఉందని అధ్యయనం హెచ్చరించింది. ఈ రంగంలో మధ్యస్థ శక్తులుగా ఎదిగిన దక్షిణ కొరియా, జపాన్, సౌదీ ఆరేబియా కూడా పైస్థాయికి చేరుకునే ప్రయత్నాలు చురుగ్గా సాగిస్తున్న సమయంలో భారత్‌కు ఇది సవాళ్లతో కూడుకున్నదనే అభిప్రాయం వ్యక్తం చేసింది. ప్రస్తుత పరిస్థితులను అధిగమించి కృతనిశ్చయంతో ముందుకు సాగేందుకు అవసరమైన శిక్షణ కొరవడడం, ఈ అత్యాధునిక సాంకేతికతలను ఉపయోగిస్తున్న క్రమంలో ఎదురవుతున్న భద్రతాపరమైన సందేహాలు, జెన్ ఏఐ వంటి వాటితో ఉద్యోగాలు పోతాయనే భయం తదితర కారణాలతో వివిధ కంపెనీలు ఆచితూచి స్పందిస్తున్నాయని తెలిపింది. మారుతున్న సాంకేతికతలకు తగ్గట్టుగా ఐటీ సర్వీసుల్లో జెన్ ఏఐ వర్తింపును వేగవంతం చేయడం ద్వారా పైచేయి సాధించాలంటే భారత్ వివిధ చర్యలు చేపట్టాలని అధ్యయనం సూచించింది.



రెండేళ్లు గడుస్తున్నా వెనుకబాటే..

2022 చివర్లో ఏఐ, జెన్ ఏఐ అనేవి పరిశ్రమల్లో కీలక మార్పులకు శ్రీకారం చుట్టాయి. అయితే రెండేళ్లు గడుస్తున్నా జెన్ ఏఐను అందిపుచ్చుకుని, వర్తింపజేసుకునే విషయంలో అధిక శాతం పరిశ్రమలు వెనుకబడ్డాయి. ఇందుకు కారణం టెక్నాలజీ కాదని మానవ స్వభావం, ప్రవర్తనదేనని అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా ఉద్యోగులు మొదలు డెవలపర్లలో ఉద్యోగాలు కోల్పోతామనే భయం వెంటాడుతుండటమే ఇందుకు కారణమని చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనే ఈ అధునాతన టూల్స్‌ను ఉద్యోగులు ఉపయోగించి మంచి ఫలితాలను సాధించేలా చేయడమనేది పెద్ద సవాల్‌గా మారుతోందని అంటున్నారు. ఈ సాంకేతికతను పూర్తిస్థాయిలో అమలు చేసే విషయంలో కస్టమర్ల నుంచి కూడా వ్యతిరేకత ఎదురవుతున్నట్టుగా కంపెనీలు పేర్కొంటున్నాయి.



భారత్ ఏం చేయాలంటే..

- వివిధ ప్రావీణ్యాలు, నైపుణ్యాల ఆధారిత శిక్షణా పద్ధతులు (ట్రైనింగ్ మోడళ్లు) చేపట్టాలి.
- ఏఐ, జెన్ ఏఐలు ఏ మేరకు ప్రభావితం చేస్తాయన్న దానిపై 'ప్రొఫిషియెన్సీ బేస్డ్ ట్రైనింగ్ మోడల్స్' తీసుకురావాలి.
- మేనేజ్‌మెంట్, వర్క్‌ఫోర్స్ తమ నైపుణ్యాలు పెంచుకునేందుకు ప్రోత్సాహకాలు అందించడంతో పాటు, ఉత్తమ శిక్షణ నిమిత్తం 'ఎగ్జిక్యూటివ్ స్పాన్సర్‌షిప్' చేపట్టాలి.
- భద్రతా పరమైన ఆందోళనలు, సమస్యలు అధిగమించేందుకు పరిశ్రమ క్లయింట్లతో దృఢమైన బంధాలు కొనసాగించేలా వ్యూహాలు రూపొందించుకోవాలి.

జనరేటివ్ ఏఐ అంటే..

జనరేటివ్ ఏఐ (జెన్ ఏఐ) అనేది యూజర్ కోరుకున్న కంటెంట్ లేదా విజ్ఞప్తికి తగ్గట్టుగా సాఫ్ట్‌వేర్ కోడ్‌ను రూపొందించుకుంటుంది. ముఖ్యంగా ట్రైనింగ్, ట్యూనింగ్, జనరేషన్ అనే మూడు దశలుగా పనిచేస్తుంది. టెక్ట్స్, ఇమేజెస్, ఆడియోల రూపంలో ఒరిజినల్ కంటెంట్‌ను తయారు చేయగలదు. అధునాతన మెషీన్ లెర్నింగ్ మోడళ్లు మరి ముఖ్యంగా డీప్ లెర్నింగ్ మోడళ్లపై ఆధారపడి ఈ టెక్నాలజీ పనిచేస్తుంది. ఇది మనుషుల మెదళ్ల మాదిరిగా నేర్చుకోవడం, నిర్ణయం తీసుకునే ప్రక్రియను వేగవంతం చేస్తుంది.

ఎవరు అడ్డుపడ్డా 'వక్ఫ్' సవరణ బిల్లు ఆగదు

దేశం కోసమే కఠిన నిర్ణయాలు: బండి



కరీంనగర్ టౌన్: భారత రాజ్యాంగానికి భవిష్యత్‌లో ఆర్ఎస్ఎస్ భావజాలంతోనే ముప్పు పొంచి ఉందంటూ మజ్లిస్ అధినేత అసదుద్దీన్ ఒవైసీ చేసిన వ్యాఖ్యలపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ మండిపడ్డారు. మజ్లిస్ పార్టీయే అసలైన దేశద్రోహ పార్టీ అని ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం కరీంనగర్‌లోని జిల్లా కోర్టు కాంప్లెక్స్‌లోని న్యాయవాదుల డిజిటల్ లైబ్రరీ కోసం బండి సంజయ్ రూ.15 లక్షలు మంజూరు చేశారు. న్యాయవాదుల కాన్ఫరెన్స్ హాల్ కోసం సీఎస్సార్ ఫండ్స్ నుంచి మరో రూ.50 లక్షల సాయం చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా న్యాయవాదులంతా బండి సంజయ్‌ను సన్మానించారు. అనంతరం సంజయ్ మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం జాతీయవాద భావజాలంతో పనిచేస్తోందన్నారు. వక్ఫ్ బోర్డు బిల్లుపై దేశవ్యాప్తంగా మద్దతు లభిస్తోందని చెప్పారు. ఒవైసీ సహా కుహనా లౌకిక వాదులు ఎంత అడ్డుకున్నా పార్లమెంట్‌లో త్వరలోనే వక్ఫ్ బోర్డు సవరణ బిల్లు ఆమోదం పొందుతుందని స్పష్టం చేశారు. దేశ శ్రేయస్సు కోసం మోదీ ప్రభుత్వం మరిన్ని కఠిన నిర్ణయాలు తీసుకునేందుకు సిద్ధంగా ఉందన్నారు.

రజతోత్సవాలపై బీఆర్ఎస్ ఫోకస్

- ఎర్రవల్లి నివాసంలో పార్టీ నేతలతో కేసీఆర్ వరుస భేటీలు
- క్షేత్రస్థాయిలో రాజకీయ పరిస్థితులు, ప్రభుత్వ పనితీరుపై ఆరా
- జన సమీకరణ, సభ ఏర్పాట్లపై 20కి పైగా ప్రత్యేక కమిటీలు
- ఏప్రిల్ 2న ఎల్కతుర్తిలో బహిరంగ సభా స్థలికి భూమి పూజ
- రెండో వారం నుంచి జిల్లాలవారీగా కేటీఆర్ పర్యటనలు



సాక్షి, హైదరాబాద్: పార్టీ రజతోత్సవ వేడుకల్లో భాగంగా ఏప్రిల్ 27న నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేయడంపై బీఆర్ఎస్ పార్టీ దృష్టి కేంద్రీకరించింది. పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ఎర్రవల్లి నివాసంలో పార్టీ ముఖ్య నేతలతో వరుస సమావేశాలు నిర్వహిస్తున్నారు. సభకు జన సమీకరణపై దిశానిర్దేశం చేస్తున్నారు. ఒక్కో నియోజకవర్గం నుంచి సభకు ఎంత మంది తరలివచ్చే అవకాశముందని ఆరా తీస్తున్నారు. మరోవైపు క్షేత్రస్థాయిలో నెలకొన్న రాజకీయ పరిస్థితులు, ప్రభుత్వ పనితీరుపై ప్రజలు స్పందిస్తున్న తీరును అడిగి తెలుసుకుంటున్నారు. ఇప్పటికే ఉమ్మడి నల్లగొండ, కరీంనగర్, వరంగల్ జిల్లాకు చెందిన ముఖ్య నేతలతో కేసీఆర్ సమావేశాలు నిర్వహించారు. బడ్జెట్ సమావేశాలపై పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావుకు ఎప్పటికప్పుడు కేసీఆర్ దిశానిర్దేశం చేస్తూ వచ్చారు. అదే సమయంలో పార్టీ ముఖ్యనేతలతో వరుస భేటీలు నిర్వహించారు. ఉత్తర తెలంగాణలో బీజేపీ అంతర్గతంగా నిర్వహిస్తున్న కార్యకలాపాలపై కేసీఆర్ ఆరా తీస్తున్నట్లు తెలిసింది. పార్టీ సంస్థాగత నిర్మాణం, ఏడాది పొడవునా నిర్వహించాల్సిన రజతోత్సవ వేడుకల తీరుతెన్నులపైనా నేతల అభిప్రాయాలు కోరుతున్నట్లు తెలిసింది.

సభ ఏర్పాట్లకు ప్రత్యేక కమిటీలు

హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో జరిగే బహిరంగ సభను ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న బీఆర్ఎస్ అధినేత.. సభ నిర్వహణలో పార్టీ ముఖ్య నేతలకు బాధ్యతలు అప్పగిస్తున్నారు. సభ నిర్వహణ కోసం 20కి పైగా కమిటీలు ఏర్పాటు చేయనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డితోపాటు ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన నేతలు సభా స్థలి ఎంపిక, రైతుల నుంచి నిరభ్యంతర పత్రాల సేకరణ, పోలీసుల అనుమతులకు దరఖాస్తులు తదితర పనుల్లో తలమునకలయ్యారు. హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే ఒడితెల సతీశ్‌కుమార్‌కు కూడా బాధ్యతలు అప్పగించారు. సుమారు 1,200 ఎకరాల్లో బహిరంగ సభ నిర్వహణ ఏర్పాట్లు జరగనుండగా, మైదానం చదును చేయడం, వేదిక నిర్మాణం తదితరాలకు సంబంధించి ఏప్రిల్ 2న భూమి పూజ చేస్తారు.

తెలంగాణ భవన్‌లో కేటీఆర్ సమీక్షలు

సభను విజయవంతం చేసేందుకు జిల్లాలవారీగా ఈ నెల 20న సన్నాహక భేటీలకు శ్రీకారం చుట్టిన కేటీఆర్.. ఇప్పటికే సూర్యాపేట, కరీంనగర్ జిల్లాల ముఖ్యనేతలతో సమావేశమయ్యారు. ఏప్రిల్ మొదటి వారంలో తెలంగాణ భవన్‌లో కేటీఆర్ అధ్యక్షతన పార్టీ అనుబంధ సంఘాల నాయకులతో వరుస సమావేశాలు జరగనున్నాయి. పార్టీ జిల్లా అధ్యక్షులను కూడా ఈ సమావేశాల్లో భాగస్వాములను చేస్తారు. ఈ సమావేశాలు ముగిసిన తర్వాత ఏప్రిల్ రెండో వారంలో కేటీఆర్ జిల్లాలవారీగా రజతోత్సవ సభ సన్నాహక సమావేశాలు నిర్వహిస్తారు. కేటీఆర్ జిల్లా పర్యటనలకు సంబంధించిన షెడ్యూల్‌ను త్వరలో విడుదల చేస్తామని తెలంగాణ భవన్ వర్గాలు వెల్లడించాయి.



శనివారం కొడంగల్‌లో ప్రభుత్వం ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందులో పాల్గొన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

ప్రజావసరాలకు అనుగుణంగా లింకురోడ్లు

- హెచ్ఆర్‌డీసీఎల్ సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ నగరంలో ప్రజావసరాలకు అనుగుణంగా అనుసంధాన (లింక్) రోడ్ల నిర్మాణం చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రాజధాని నగరంతో పాటు హెచ్ఎండీఏ పరిధిలో హైదరాబాద్ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (హెచ్ఆర్‌డీసీఎల్) ఆధ్వర్యంలో చేపడుతున్న లింక్ రోడ్ల నిర్మాణం, విస్తరణపై ఐసీసీసీలో శనివారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా 49 రోడ్ల నిర్మాణం, విస్తరణపై సీఎం పలు సూచనలు చేశారు. వివిధ ప్రాంతాల మధ్య అనుసంధానం పెంచాలని, ప్రజలు ఎలాంటి అవాంతరాలు లేకుండా రాకపోకలు సాగించేందుకు వీలుగా రహదారుల నిర్మాణం చేపట్టాలని సీఎం ఆదేశించారు. వివిధ ప్రాంతాల్లో రహదారుల నిర్మాణం వల్ల ప్రయాణికుల ఇబ్బందులు తొలగిపోయి సమయం ఆదా అయ్యేలా ఉండాలని సూచించారు. ఇందుకోసం అదనపు భూసేకరణకు కొంత అధిక వ్యయమైనా వెనుకాడవద్దని స్పష్టం చేశారు.

ఉగాది మిత్రమిలన్

- అలరించిన కళాకారుల ప్రదర్శనలు
- 28 ఏళ్లుగా నిర్వహణ



పురాతన నాణేల గురించి వివరిస్తున్న మురళీధర్



పెయింటింగ్ వేస్తున్న గిరి చిత్రకారులు

ఆదిలాబాద్: ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని రవీందర్ శర్మ గురూజీ కళాశ్రమంలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న మిత్ర మిలన్ కార్యక్రమం శనివారం రెండో రోజుకు చేరుకుంది. ఏటా ఉగాదికి రెండు రోజుల ముందు ఈ కార్యక్రమానికి శ్రీకారం చుడతారు. కళాశ్రమంలో గురూజీ జీవించి ఉన్న సమయంలో దేశం నలుమూలల నుంచి వివిధ కళాకారులు తరలివచ్చి కళా చర్చలు, శిక్షణ శిబిరాలు, కళా వస్తువుల ప్రదర్శనలో పాల్గొనేవారు. ప్రస్తుతం కళాకారుల రాక తగ్గినా, ఆనవాయితీని వారి కుటుంబ సభ్యులు కొనసాగిస్తూ ఉగాది మిత్ర మిలన్ చేపడుతున్నారు. కార్యక్రమంలో భాగంగా జిల్లాకు చెందిన కళాకారులు నిర్వహించిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగి, రచయిత బీ.మురళీధర్ పురాతన నాణేల ప్రదర్శన చారిత్రక అంశాలను గుర్తుకు తెచ్చింది. క్రీస్తుపూర్వం మొదలుకొని ప్రస్తుత ఆధునిక కరెన్సీ వరకు ఎన్నో నాణేలు, నోట్లు ప్రదర్శనకు ఉంచారు. గుడిహత్నూర్ మండలం తోషం-సోయగూడెం గ్రామానికి చెందిన మెస్రం రాము ప్రదర్శించిన పెయింటింగులు చూపరులను ఆకట్టుకున్నాయి. గిరిజన సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించే విధంగా ఆ యువకుడు వేసిన పెయింటింగ్స్ ఆకర్షించాయి.

యువ కళాకారులకు ఉపయుక్తం..



ఉగాది సందర్భంగా ప్రతి సంవత్సరం మిత్ర మిలన్ కార్యక్రమం ఏర్పాటు చేయడం గొప్ప విషయం. ఈ కార్యక్రమం వల్ల ఎన్నో కొత్త విషయాలు నేర్చుకునే అవకాశం కలుగుతుంది. మాలాంటి యువ చిత్రకారులకు ఇలాంటి వేదికలు భవిష్యత్‌కు మార్గదర్శకంగా నిలుస్తాయి. గిరిజనుల్లో సైతం ఎంతోమంది ప్రతిభగల చిత్రకారులు, కళాకారులు, సంగీతకారులు, శిల్పకారులు ఉన్నారు. వారిని ప్రోత్సహించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వం ముందుకు రావాలి.

– మెస్రం రాము, చిత్రకారుడు, సోయగూడెం

ఏసీబీకి చిక్కిన వ్యవసాయ మార్కెట్ ఉద్యోగులు

- రూ.60 వేలు లంచం తీసుకుంటుండగా పట్టుకున్న అధికారులు

కరీంనగర్‌క్రైం: పండ్ల దుకాణాల లైసెన్స్ రెన్యువల్‌కు డబ్బులు డిమాండ్ చేసిన కరీంనగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ గ్రేడ్ వన్ సెక్రటరీ పురుషోత్తం, సెక్యూరిటీ గార్డు శ్రీనివాస్‌రెడ్డిని శనివారం ఏసీబీ అధికారులకు పట్టుకున్నారు. బాధితులు మహమ్మద్ అబ్దుల్ గఫూర్ ఊరాఫ్ నిమ్మకాయల పాషా, సుల్తానా ఆబీర్ వివరాల ప్రకారం.. కరీంనగర్ వ్యవసాయ మార్కెట్లో ఉన్న శ్రీపాదరావు ఫ్రూట్స్ మార్కెట్ ఉంది. ఇందులో 12మంది ఫ్రూట్స్ దుకాణాలు నిర్వహిస్తున్నారు. ఈ సంవత్సరం రెన్యువల్ చేసుకునేందుకు వ్యవసాయ మార్కెట్ కమిటీ సెక్రటరీ పురుషోత్తంను కలిశారు. లైసెన్స్ రెన్యువల్ చేసేందుకు రూ.2లక్షలు డిమాండ్ చేశాడు. అంత డబ్బు ఇవ్వలేమని చెప్పగా.. చివరికి రూ.60వేలకు ఒప్పందం కుదుర్చుకున్నారు. అయినప్పటికీ లైసెన్సు ఇవ్వకుండా ఇబ్బంది గురి చేయడంతో ఏసీబీని ఆశ్రయించారు. ఆయన కార్యాలయంలో నిమ్మకాయల పాషా సెక్రటరీ పురుషోత్తం, సెక్యూరిటీగార్డు శ్రీనివాస్‌రెడ్డికి డబ్బులు ఇస్తుండగా ఏసీబీ అధికారులు పట్టుకుని, అరెస్టు చేశారు.



ఏసీబీ అధికారులకు పట్టుబడిన మార్కెట్ కమిటీ గ్రేడ్-1 సెక్రటరీ పురుషోత్తం, సెక్యూరిటీ గార్డు శ్రీనివాస్‌రెడ్డి

తోటి ఉద్యోగులను మోసం చేసిన ఎస్ఎల్ఎంపై చర్యలు

- సర్వీసు నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు

కొత్తపల్లి(కరీంనగర్): విద్యుత్ సంస్థలో పనిచేసే తోటి ఉద్యోగులను మోసం చేసి రూ.లక్షలు వసూలు చేసిన ఉద్యోగిని సర్వీసు నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఎస్ఎల్ఎం సీహెచ్.తిరుపతిరెడ్డిని సర్వీసు నుంచి తొలగిస్తూ శనివారం కరీంనగర్ సర్కిల్ ఎస్ఈ మేక రమేశ్ బాబు ఉత్తర్వులు జారీ చేశారు. టీజీఎన్‌పీడీసీఎల్ కరీంనగర్ సర్కిల్ పరిధిలోని హుజూరాబాద్ డివిజన్ సైదాపూర్‌లో సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న సీహెచ్.తిరుపతిరెడ్డి తోటి ఉద్యోగులను నమ్మించి తమ వారసులకు ఉద్యోగాలిప్పిస్తానని రూ.లక్షలు వసూలు చేసాడు. ఉద్యోగులు సంపత్, సమ్మిరెడ్డి, రాజేష్, నాగభూషణం, కనకయ్యలను లీవ్‌లో వెళ్లమని సలహా ఇచ్చాడు. మెడికల్ ఇన్‌వాలిడేషన్ కింద వారసులకు ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పడంతో వారు సెలవుపై వెళ్లారు. ఏడాది గడిచిన విధుల్లో చేరకపోవడంతో విద్యుత్‌శాఖ వారిని సర్వీసు నుంచి తొలగించారు. అసలు బాగోతం బహిర్గతం కావడంతో సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్.తిరుపతిరెడ్డిపై డిపార్ట్‌మెంటల్ ఎంక్వయిరీ వేశారు. హుజూరాబాద్ డివిజన్ పరిధిలోని కొందరు ఉద్యోగుల దగ్గర డబ్బులు వసూలు చేసినట్లు అవినీతి ఆరోపణలు విచారణలో నిజం కావడంతో సర్వీసు నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

చెత్తకుప్పలోని ఆహారమే దిక్కు



ఆధ్యాత్మిక కేంద్రం వేములవాడలో శుక్రవారం సాయంత్రం మనసును కలచివేసే సంఘటన జరిగింది. ఓ వృద్ధుడు తన ఆకలిని తీర్చుకునేందుకు చెత్తకుప్పను ఆశ్రయించాడు. చెత్తకుప్పలో పడేసిన అన్నం పొట్లాల్లో మిగిలిన ఆహారాన్ని సేకరించుకొని ఆకలి తీర్చుకున్నాడు. నిత్యం భక్తులతో రద్దీగా ఉండే వేములవాడలో ఓ వృద్ధుడు ఆకలితో అలమటిస్తుండడం.. చెత్తకుప్పను ఆశ్రయించడం స్థానికులను కలచివేసింది.

– వేములవాడ

పెట్టుబడుల పేరుతో రూ.40.90 లక్షలకు టోకరా

- అంతర్రాష్ట్ర సైబర్ నిందితుడి అరెస్ట్

కరీంనగర్‌క్రైం: పెట్టుబడుల పేరుతో రూ.40.90 లక్షలకు టోకరా వేసిన గుజరాత్‌లోని సూరత్‌కు చెందిన నిందితుడిని కరీంనగర్ సైబర్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వారి వివరాల ప్రకారం నగరానికి చెందిన ఓ వ్యక్తి ఇన్‌స్టాగ్రాంలో ఇన్వెస్ట్‌మెంట్ ప్రకటనకు ఆకర్షితుడయ్యాడు. గతేడాది జూలై నుంచి పెట్టుబడులు పెడుతూ... సైబర్‌నేరగాళ్లు సూచించిన బ్యాంక్ అకౌంట్లో ఏడు దఫాలుగా రూ.40.90 లక్షలు పెట్టుబడి పెట్టాడు. తరువాత వారు స్పందించకపోవడంతో సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన డీసీపీ నర్సింహారెడ్డి తన బృందంతో దర్యాప్తు ప్రారంభించారు. గుజరాత్‌లోని సూరత్‌కు చెందిన నిందితుడు నితిన్ దేవచంద్ భాయ్ గజేరాని ఈ నెల 27వ తేదీన అరెస్టు చేశారు. అక్కడి కోర్టు అనుమతితో ట్రాన్సిట్ వారెంట్‌తో కరీంనగర్‌కు తరలించారు. కోర్టులో హాజరు పరిచి రిమాండ్ చేశారు. నిందితుడిపై ఇప్పటికే తెలంగాణలో రెండు, అరుణాచల్‌ప్రదేశ్, హరియాణా, కర్ణాటక, మహారాష్ట్ర, రాజస్థాన్, తమిళనాడు, ఉత్తరప్రదేశ్, పశ్చిమబెంగాల్, కేరళలో కేసులు ఉన్నాయి.

స్కోచ్ అవార్డు అందుకున్న కలెక్టర్



అవార్డు అందుకుంటున్న కలెక్టర్ రాజర్షి షా



స్కోచ్ అవార్డు అందుకుంటున్న పీవో ఖుష్బూ గుప్తా

కైలాస్‌నగర్: దేశంలోని అత్యున్నత పౌర పురస్కారాల్లో ఒకటిగా భావించే ప్రతిష్టాత్మక స్కోచ్ అవార్డును ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా శనివారం అందుకున్నారు. బాలల దినోత్సవం పురస్కరించుకుని విద్యార్థుల ఆరోగ్య సంరక్షణ, జీవన శైలిలో మార్పు తీసుకురావాలనే ఉద్దేశంతో గతేడాది నవంబర్ 14న రాష్ట్రంలోనే తొలిసారిగా ఆరోగ్య పాఠశాల కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. జిల్లాలోని అన్ని ఉన్నత పాఠశాలలు, కేజీబీవీలు, ఇంటర్మీడియెట్ కళాశాలల్లో అమలు చేశారు. నాలుగు వారా ల పాటు నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రతీ సోమవారం వ్యక్తిగత పరిశుభ్రత, మంగళవారం పోషకాహారంపై అవగాహన, బుధవారం ఒత్తిడి ని వారించుకునే మార్గాలు, గురువారం డ్రగ్స్‌కు దూ రంగా ఉండడం, శుక్రవారం కాలానుగత వ్యాధుల నివారణ, శనివారం వ్యక్తిత్వ వికాసం వంటి ఆరు సూత్రాలపై అవగాహన కల్పించేలా ప్రత్యేక శ్రద్ధ వహించారు. కార్యక్రమ నిర్వహణపై ప్రతీ వారం విద్యార్థులు, గైడ్ టీచర్లతో సమీక్షించారు. విద్యార్థులు మద్యం, పొగాకు వంటి వాటికి దూరంగా ఉండేలా చొరవ చూపారు. ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ, చదువులో రాణించేలా అవగాహన కల్పించారు. ఈ వినూత్న కార్యక్రమానికి గాను స్కోచ్ సంస్థ కలెక్టర్‌ను ఈ అవార్డుకు ఎంపిక చేసింది. శనివారం న్యూఢిల్లీలో నిర్వహించిన కార్యక్రమంలో పద్మశ్రీ అవార్డు గ్రహీత డా.దీపక్ బి.పాఠక్, స్కోచ్ గ్రూప్ సంస్థల వైస్ చైర్మన్ డా.గురుశరణ్ దనుంజయ్ చేతుల మీదుగా కలెక్టర్ ఈ అవార్డు అందుకున్నారు.

ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తాకు కూడా..

ఉట్నూర్‌రూరల్: గిరిజనులకు చేస్తున్న సేవలకు గుర్తింపుగా ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తాకు కూడా స్కోచ్ అవార్డు దక్కిన విషయం విదితమే. ఈ మేరకు ఆమె శనివారం ఢిల్లీలో అవార్డు అందుకున్నారు. ఐటీడీఏ ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులు, ఆదివాసీ నాయకులు పీవోకు శుభాకాంక్షలు తెలిపారు.

మున్నూరుకాపులకు మంత్రి పదవులివ్వాలి

- ఆల్ ఇండియా మున్నూరుకాపు (కాపు) సంక్షేమ సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్

కొత్తపల్లి(కరీంనగర్): తెలంగాణలో బలమైన సామాజికవర్గమైన మున్నూరు కాపులకు మంత్రివర్గ విస్తరణలో చోటు కల్పిస్తూ మంత్రి పదవులివ్వాలని ఆల్ ఇండియా మున్నూరుకాపు (కాపు) సంక్షేమ సంఘం అధ్యక్షుడు, హైకోర్టు న్యాయవాది ఈవీ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మున్నూరుకాపులకు మంత్రివర్గంలో సముచిత స్థానం కల్పించాలని గతంలోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, సోనియాగాంధీ, ప్రియాంకాగాంధీ, ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, సీనియర్ నాయకులు కేసీ వేణుగోపాల్‌లకు లేఖ రాసినట్లు వెల్లడించారు. రాష్ట్ర జనాభాలో 24 శాతానికి పైబడిన మున్నూరు కాపులు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా వెనకబడ్డారని, భవిష్యత్‌లో అన్ని రంగాల్లో రాణించాలంటే రాజకీయ ఎదుగుదల ఆవశ్యకమని, అందుకు రాష్ట్ర ప్రభుత్వం చేయూతనందించాలని కోరారు.

రాజన్నకు వీకెండ్ తాకిడి



వేములవాడ: రాజన్నకు వీకెండ్ తాకిడి పెరిగింది. శనివారం వేకువజాము నుంచే భక్తుల రాక మొదలైంది. అభిషేకాలు, అన్నపూజలు, కల్యాణ మొక్కులు చెల్లించుకున్నారు. దాదాపు 20 వేల మంది భక్తులు రాజన్నను దర్శించుకున్నారు. రూ.21లక్షల ఆదాయం సమకూరినట్లు అధికారులు తెలిపారు.